సోషల్ మీడియాలో అభిమానుల మనసు దోచుకుంటున్న సీఎం కేసీఆర్ ఏఐ ఫొటో

సీఎం కేసీఆర్ ఏఐ ఫొటోలకు యమా క్రేజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని రంగాల్లో ప్రవేశించిన కృత్రిమ మేధస్సు (ఏఐ) తాజాగా ఎన్నికల రంగంలో హల్‌చల్ చేస్తున్నది. ఆయా రాజకీయ పార్టీలు తమ నాయకుల ఫొటోలను ఏఐ సాయంతో మెరుగులు దిద్దుతున్నారు. తాజాగా ఏఐ సాయంతో రూపుదిద్దుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటో పార్టీ శ్రేణులను విపరీతంగా ఆకట్టుకుంటున్నది.

ఈ ఫొటోను బీఆర్ఎస్ అభిమానులు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. సాధారణ పొలిటికల్ పోస్టర్లు, ఫొటోలకు భిన్నంగా కనిపిస్తున్న ఈ చిత్రాలు సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తున్నాయి. కేసీఆర్ ఏఐ ఫొటోలకు అనూహ్య స్పందన రావడంతో.. వాటిని పార్టీ అధికారిక ఖాతాలకు ట్యాగ్ చేస్తూ.. సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన ఏఐ ఫొటోలు సామాన్యులను సైతం ఆకట్టుకుంటుండగా.. కేసీఆర్‌ను కొత్తగా చూపే మేకోవర్‌కు ఆయన అభిమానుల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తూనే, వాట్సాప్ స్టేటస్‌గా, డీపీలుగా, వాల్‌పోస్టర్లుగా పెట్టుకొని మురిసిపోతున్నారు.

మా ఊరికి ఎందుకొచ్చారు?

- జగిత్యాలలో కాంగ్రెస్ నేతలకు చేదు అనుభవం

జగిత్యాల, అక్టోబర్ 12: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో కాంగ్రెస్ నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. గురువారం పలు వార్డుల్లో ప్రచారానికి వెళ్లిన వారిని ప్రజలు నిలదీశారు. 'అధికారంలో ఉన్నప్పుడు మా కోసం ఏమైనా చేశారా? ఒక్క పథకంలోనైనా లబ్ధి కలిగించారా? ఓట్లప్పుడే మేం కనిపిస్తాం.. మా కాలనీలు మీకు గుర్తుకొస్తాయి. ఇంకోసారి ఇటువైపు రాకండి' అంటూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మిని మహిళలు నిలదీశారు. దీంతో ప్రచారం చేయకుండానే నాయకులు వెనుదిరిగారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మరదలు అయిన విజయలక్ష్మికి సొంత వార్డులోనే చేదు అనుభవం ఎదురుకావడం, ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయడంతో 'ప్రచారం చేసేదెలా?' అంటూ కాంగ్రెస్ శ్రేణులు చర్చించుకోవడం కనిపించింది.

దండం పెడతా.. పోటీ వద్దయ్యా!

- కాంగ్రెస్, బీజేపీ ఖరీదైన పార్టీలు
- ఓటమి తెలిసీ కోట్ల ఖర్చెందుకు?
- వచ్చేది బీఆరెస్సే.. మనకొద్దీ పోటీ
- సంపాదన పోయి రోడ్డునపడతాం
- టికెట్ ఆశావహులకు కుటుంబ సభ్యుల నుంచి హెచ్చరికలు

''20 కోట్లుంటేనే మాట్లాడు. అది టికెట్ ఖర్చే. గెలవడానికి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంత బడ్జెట్ నీ దగ్గర ఉంటేనే సీటు ఆశించు. లేకపోతే ఆశలు వదులుకో. అనవసరంగా ఫోన్‌లు చేసి, కలిసి మా సమయం వృథా చేయొద్దు. ప్రత్యర్థి బీఆర్ఎస్‌పై గెలవడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. తొమ్మిదిన్నరేండ్లలో అభివృద్ధి ఆకాశన్నంటింది. ఎదుర్కోవడం కష్టం'' ఇది కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహులకు చేరిన సందేశం.

''ఎమ్మెల్యే టికెట్ కోసం 20 కోట్లేంది? భూములు అమ్మకానికి పెట్టడం ఏంటీ? డబ్బులు చూసి సీటు ఇస్తాననడం సరైనది కాదు. అన్ని కోట్లు ఖర్చుపెట్టి రాజకీయాల్లో ఉండాలా? టికెట్ వస్తే గెలుపు కోసం ఆస్తులన్నీ అమ్ముతావా? ఓటమి తప్పదని తెలిసీ పోటీ అవసరమా? ప్రజలందరూ బీఆర్ఎస్‌తోనే ఉన్నారు. ప్రతీ కుటుంబం సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నది. ప్రజలు మళ్లీ సీఎం కేసీఆర్‌నే గెలిపిస్తారు. అనవసరంగా పోటీకి దిగి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకోవడం సరికాదు. టికెట్ వస్తే రానీ.. లేకపోతే లేదు. అంతేకానీ డబ్బులు ఖర్చు పెట్టొద్దు. ఓడిపోతే మనల్ని పట్టించుకునే నాథుడు ఉండడు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి''.. గ్రేటర్‌లోని ఓ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహుడి భార్య హెచ్చరిక.

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీ ఖరీదైన పార్టీలుగా మారిపోయాయి. ఆస్తులు అమ్ముకోవడానికి సిద్ధమైతే తప్ప ఆ పార్టీల నుంచి టికెట్ ఆశించడం వేస్ట్ అన్న భావన వినిపిస్తోంది. హైకమాండ్‌కు రూ. 20 కోట్లు అప్పజెప్పినా టికెట్‌పై గ్యారెంటీ లేదని చెబుతున్నారు. విషయం తెలిసిన ఆశావహుల కుటుంబ సభ్యులు వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. కోట్లు ఖర్చు చేసి ఎన్నికల్లో నిలబడాల్సిన అవసరం లేదని తెగేసి చెబుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అడుగడుగునా కనిపిస్తున్నదని, మళ్లీ గెలిచేది బీఆరెస్సేనని నచ్చజెబుతున్నారు. పోటీ నుంచి విరమించుకోవాలని బతిమాలుతున్నారు. ఇంత ఖరీదైన రాజకీయం వద్దని సూచిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి ఇళ్లలో ఇప్పుడివే చర్చలు జరుగుతున్నాయి.

ఈ రాజకీయాలు మనకొద్దు

భర్త టికెట్ కోసం ఓ నియోజకవర్గానికి చెందిన నాయకుడి భార్య రూ. 10 కోట్లు సమకూర్చారు. టికెట్ కోసం పోటీ బాగా ఉందని, మరింత ఖర్చు చేయాల్సి ఉందని సమాచారం అందడంతో ఆ నాయకుడు ఇప్పుడు తెలిసిన వారు, బంధువుల వద్ద అప్పుకు ప్రయత్నిస్తున్నారు. భూముల తనఖాకు రెడీ అవుతుండడంతో భార్య అతడిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ''పిచ్చిగిట్ల లేసిందా? ఓడిపోతామని తెలిసినా అంత డబ్బు ఖర్చు పెట్టుడేంది? భూములు అమ్ముడు ఏందీ? టికెట్ వద్దు ఏమొద్దు. మనకు ఈ రాజకీయాలే వద్దు. మాట వినకపోతే మేం వెళ్లిపోతాం'' అంటూ భర్తపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ఆ ఒక్క నాయకుడికే ఎదురైన అనుభవం కాదు. రాష్ట్రంలోని చాలామంది ఆశావహుల పరిస్థితి ఇదే. అంతంత సొమ్ము ఖర్చుపెట్టాక కూడా ఓడిపోతే రోడ్డున పడాల్సి వస్తుందని బంధువులు, స్నేహితులు నచ్చజెబుతున్నారు. కొందరు నాయకులు కుటుంబ సభ్యులు మాటలు విని సైలెంట్ అయిపోతుంటే.. మరి కొందరు మాత్రం ఎలాగైనా బరిలోకి దిగాలని కంకణం కట్టుకున్నట్టు తెలుస్తున్నది.

వ్యాపారంగా మార్చేశారు

కాంగ్రెస్, టికెట్ల బీజేపీ అమ్మకాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయాలను పూర్తిగా వ్యాపారంగా మార్చేశారని ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అంత సొమ్ము ఖర్చుపెట్టాక గెలిచినా.. తిరిగి సంపాదనపైనే దృష్టిపెడతారు తప్ప, అభివృద్ధి ఊసెత్తరని మేధావులు సైతం హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యమైన పోటీ ఎంతమాత్రమూ కాదని వాపోతున్నారు. అభివృద్ధిని కాదని టికెట్లు అమ్ముకుంటున్న కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే రాష్ట్రం అధోగతి పాలువుతుందని ప్రజలను హెచ్చరిస్తున్నారు.

నారాయణపేట జిల్లా మక్తల్‌లో శ్రీహరి మద్దతుదారుల సమావేశం

మక్తల్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

- ఎమ్మెల్యే టికెట్ శ్రీహరికే ఇవ్వాలంటున్న కార్యకర్తలు

మక్తల్ టౌన్, అక్టోబర్ 12: మక్తల్ కాంగ్రెస్‌లో వర్గపోరు భగ్గుమన్నది. గురువారం మక్తల్ మాజీ జడ్పీటీసీ వాకిటి శ్రీహరి నివాసంలో ఆయన సానుభూతిపరులు సమావేశమయ్యారు. శ్రీహరికే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్ఠానం ఆయన పేరునే ఖరారు చేయాలని నినదించారు. దీంతో ఆ పార్టీలో మరోసారి ముసలం బహిర్గతమైంది. ఇటీవలే దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ అధినేత సంగంబండ బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వారికే టికెట్ కేటాయిస్తారని వాకిటి వర్గీయులు ఆందోళన చెందుతున్నట్టు తెలుస్తున్నది.

గాంధీభవన్‌పై బీసీ నేతల దండయాత్ర

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీలో అభ్యర్థుల ఎంపికకు ఆ పార్టీ స్క్రీనింగ్ కమిటీ, ఎన్నికల కమిటీ సమావేశమవుతున్న నేపథ్యంలో 'హలో బీసీ-చలో గాంధీభవన్'కు పిలుపునిచ్చారు. గాంధీభవన్ ముందు భారీ ధర్నా చేయాలని నిర్ణయించారు.

అధిష్ఠానానికి అల్టిమేటం

సుమారు రెండు నెలల నుంచి కాంగ్రెస్ పార్టీలో బీసీల లొల్లి కొనసాగుతున్నది. రాష్ట్రంలో అత్యధిక జనాభా గల తమకు తగినన్ని సీట్లు ఇవ్వాలని ఆ పార్టీ బీసీ నేతలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి రెండేసి ఎమ్మెల్యే సీట్ల చొప్పున మొత్తం 34 సీట్లు బీసీలకు ఇవ్వాలన్న ప్రతిపాదనను పీసీసీ కూడా ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తరువాత సర్వేలు, చేరికలు, ఇతర కారణాలతో బీసీలకు ఇవ్వదల్చిన సీట్లలో కొత పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసిన బీసీ నేతలు ఇటీవల ఢిల్లీ వెళ్లి ఐదు రోజులపాటు మకాం వేశారు. వారికి అధిష్ఠానం పెద్దలు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. దీనిని అవమానంగా భావించిన బీసీ నేతలు అధిష్ఠానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. బీసీలకు 34 సీట్లు ఇవ్వకపోతే తమ సత్తా ఏమిటో చూపిస్తామని, కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని హెచ్చరించారు.

బీసీలను కాదంటే పార్టీ ఓటమి తప్పదు

ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు కనీసం 34 సీట్లు ఇవ్వాల్సిందేనని గురువారం నాటి సమావేశంలో బీసీ నేతలు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశం అనంతరం బీసీ నేత కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ...'అధిష్ఠానం మాట నెలబెట్టుకోవాలి. పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఆమోదించిన ప్రకారం బీసీలకు కనీసం 34 సీట్లు ఇవ్వాలి. ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్సీలు, రాజ్యసభలు ఇస్తామంటే ఊరుకునేది లేదు. ఇది ముమ్మాటికి బీసీలను మోసం చేయడమే. సర్వేల పేరుతో బీసీలను మోసం చేయాలని చూస్తున్నారు. నిన్నమొన్న పార్టీలో చేరిన వారికి అనుకూలంగా సర్వేలు వస్తుంటే, దశాబ్ద కాలంగా పార్టీలో ఉన్నవారికి ఎందుకు అనుకూలంగా రావడం లేదు? ఇదేం విధానం?' అని నిలదీశారు.

కాంగ్రెస్‌కు గట్టి అభ్యర్థులు కరువు

- పేరుకే వెయ్యికి పైగా దరఖాస్తులు
- నేటి స్క్రీనింగ్ భేటీలోనైనా గెలుపు గుర్రాలు కొలిక్కి వచ్చేనా?

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే టికెట్ల కోసం వెయ్యికిపైగా దరఖాస్తులు వచ్చినా అత్యధిక నియోజకవర్గాల్లో సమర్థులైన, గట్టి అభ్యర్థులు దొరకని పరిస్థితిని కాంగ్రెస్ ఎదుర్కొంటున్నది. దరఖాస్తు చేసుకున్నవారిలో సగానికిపైగా నియోజకవర్గాల్లో గెలిచే సత్తా ఉన్నవారే లేక అధిష్ఠానం తలపట్టుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రక్రియ ప్రారంభించి దాదాపు రెండు నెలలు అవుతున్నది.

భేటీలపై భేటీలు

అభ్యర్థుల ఎంపిక బాధ్యతను పార్టీ అధిష్ఠానం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, స్క్రీనింగ్ కమిటీకి అప్పగించింది. ఈ రెండు కమిటీలు భేటీలపై భేటీలు జరుపుతున్నా అభ్యర్థుల జాబితా కొలిక్కిరావడం లేదు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మూడుసార్లు, స్క్రీనింగ్ కమిటీ హైదరాబాద్‌లో రెండుసార్లు, ఢిల్లీలో మరో రెండుసార్లు భేటీ అయింది. కానీ అడుగు ముందుకు పడటం లేదు. కమిటీల భేటీల్లో నేతల మధ్య పంచాయితీకే సరిపోతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం శుక్రవారం జరిగే స్క్రీనింగ్ సమావేశంలో అయినా అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వస్తుందా? మళ్లీ వాయిదా పడుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చిన దరఖాస్తుల్లో కేవలం 30-35 సీట్లలో అభ్యర్థులను స్క్రీనింగ్ కమిటీ ఫైనల్ చేసినట్టు తెలిసింది. ఇంకా సుమారు 85-90 సీట్లలో అభ్యర్థుల ఎంపికకు ఆపసోపాలు పడుతున్నది. ఆయా నియోజకవర్గాలకు ఇద్దరు ముగ్గురు దరఖాస్తు చేసుకున్నా గట్టి అభ్యర్థులు లేరనే టాక్ వినిపిస్తున్నది.

బదిలీ అధికారుల స్థానంలో కొత్త జాబితా

- కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం ప్రతిపాదనలు

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు కమిషనర్లు, 10 మంది నాన్‌క్యాడర్ ఎస్పీలను, నలుగురు జిల్లా కలెక్టర్లను కేంద్రం ఎన్నికల సంఘం బదిలీ చేసిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లను ప్రతిపాదించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఒక్కో పోస్టుకు ముగ్గురు అధికారుల చొప్పున కేంద్ర ఎన్నికల సంఘానికి గురువారం ప్రతిపాదనలు పంపింది.

తనిఖీల్లో 43.70 లక్షలు పట్టివేత

మంచిర్యాల, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ.43.70 లక్షలు పట్టుబడ్డాయి. ఇందులో జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.39 లక్షలు, తాండూర్ మండలం రేపల్లెవాడ చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి జాతీయ రహదారిపై రూ.1.20 లక్షలు, జైనూర్‌లో రూ.83 వేలు, దహెగాం మండలం కల్వాడ్ గ్రామ చెక్‌పోస్టు వద్ద రూ.1,67,078ను పోలీసులు పట్టుకున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన చీరల స్వాధీనం

వెల్గటూర్, అక్టోబర్ 12: ఎన్నికల్లో పంచేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన చీరలను వెల్గటూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెగ్యాంలో పాత సూర్యనారాయణ ఇంట్లో అక్రమంగా చీరలు నిల్వ ఉంచారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు గురువారం దాడులు చేయగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.80,550 విలువైన 179 చీరలు ఉన్నట్టు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నామని, ఎన్నికల్లో ప్రజలకు పంచేందుకు నిల్వ ఉంచారని విచారణలో వెల్లడైనట్టు ఎస్సై శ్వేత తెలిపారు. సూర్యనారాయణపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బీజేపీకి 'గోసా' మహల్

- బండి వర్సెస్ డీకేగా మారిన గ్రూపుల రాజకీయం
- విక్రమ్‌గౌడ్ కోసం డీకే పావులు
- రాజాసింగ్‌కు సంజయ్ హామీ
- ఖైరతాబాద్‌లో చింతలకు చింత
- ముషీరాబాద్‌లో దత్తన్న-లక్ష్మణ్ మధ్య ముదిరిన వైరం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీజేపీలో ఇప్పుడు ఇద్దరు అగ్రనేతల మధ్య నిప్పు రాజుకుంది. వారిద్దరూ మరెవరో కాదు. ఒకరు మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కాగా, మరొకరు మాజీ మంత్రి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ. గ్రేటర్ బీజేపీలో సీట్ల కేటాయింపు ప్రక్రియ వీరి మధ్య చిచ్చు రాజేసింది. ఎవరికి వారు తమ వారికి ప్రాధాన్యం ఇచ్చేందుకు పార్టీ నిబంధనలను సైతం తోసిరాజంటున్నారు. ఈ పోరులో బండి కాస్తంత వెనకబడినట్టు తెలుస్తున్నది. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ విజయానికి తీవ్రంగా శ్రమించిన బండిని అదే గ్రేటర్‌లో ఆయన పాత్రను నామమాత్రం చేయాలని డీకే వర్గం కంకణం కట్టుకున్నట్టు సమాచారం. బండి ఇటీవల తన అనుచరుడు చికోటి ప్రవీణ్ కుమార్‌ని పార్టీలోకి ఆహ్వానిస్తే కిషన్‌రెడ్డి అడ్డుతగిలారు. ఇలాగైతే లాభం లేదని భావించిన చికోటి.. అరుణ ద్వారా రాయబారం నడిపి ఆమె సమక్షంలోనే కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ విషయంలో బండిపై అరుణ పైచేయి సాధించినట్టు అయింది. తాజాగా ఇప్పుడు వీరిద్దరి మధ్య గోషామహల్ సీటు అగ్గిరాజేసింది. రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి గోషామహల్ సీటును మళ్లీ ఆయనకే కేటాయించాలని బండి సంజయ్ కోరుతుండగా, ఆ స్థానాన్ని విక్రమ్ గౌడ్‌కు ఇప్పించాలని అరుణ పట్టుదలగా ఉన్నారు. ఈ విషయంలో కిషన్‌రెడ్డి కూడా ఆమెవైపే నిలబడినట్టు సమాచారం. అంతే కాదు, గోషామహల్ నుంచి బరిలోకి దిగేది తానేనని, బీజేపీ పెద్దల నుంచి హామీ కూడా వచ్చిందని విక్రమ్‌గౌడ్ చెప్పుకుంటున్నారట.

ఈ మూడింటిపైనే రచ్చ

గ్రేటర్ పరిధిలోని మిగతా నియోజకవర్గాల సంగతి అటుంచితే.. ముషీరాబాద్, గోషామహల్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిస్థితి భిన్నంగా ఉంది. రాజాసింగ్ తనపై ఉన్న వేటును ఎలాగైనా తొలగించుకుని గోషామహల్ నుంచి పోటీ చేయాలని పట్టుదలగా ఉన్నారు. ఆ సీటుపై బండి సంజయ్ హామీ కూడా ఇచ్చారని రాజాసింగ్ అనుచరులు చెప్పుకుంటున్నా, టికెట్లు కేటాయించే సమయం దగ్గరపడినా సస్పెన్షన్ కొనసాగుతుండడంతో బండి వర్గంపై డీకే అరుణ వర్గం పైచేయి సాధించినట్టు అయింది. ఖైరతాబాద్ నుంచి ఈసారి చింతల రామచంద్రారెడ్డికి బదులు అదే పార్టీ కార్పొరేటర్‌కి ఇచ్చేందుకు మరో అగ్ర నాయకుడు పట్టుబడుతున్నట్టు తెలిసింది. ముషీరాబాద్ నుంచి దత్తాత్రేయ, లక్ష్మణ్ ఎవరికి వారే తమవారికి టికెట్లు ఇప్పించుకునే క్రమంలో ఆధిపత్య పోరుకు దిగారు. ఇలా ఈ మూడు స్థానాలు సొంత పార్టీ నాయకుల మధ్య విభేదాలకు ఆజ్యం పోశాయి.

టికెట్లు ఇవ్వకపోతే సహకరించం

బీజేపీ పెద్దలకు బీజేవైఎం అల్టిమేటం

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): బీజేపీలో కొత్త లొల్లి మొదలైంది. బీజేపీ, దాని అనుబంధ యువజన విభాగం బీజేవైఎం మధ్య వైరం ముదిరింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు కూడా టికెట్లు ఇవ్వాలని బీజేవైఎం నేతలు డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో సహాయ నిరాకరణ తప్పదని హెచ్చరించినట్టు సమాచారం. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో సోషల్‌మీడియా సభ్యులతో సమావేశం జరిగింది. దీనికి బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వీసూర్య హాజరయ్యారు. ఆయనతోపాటు ఎంపీ కే లక్ష్మణ్, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం నేతలు మాట్లాడుతూ.. ధర్నాలు, రాస్తారోకోలు, కొట్లాటల్లో పాల్గొని అరెస్టులు, కేసులు ఎదుర్కొన్నామని, తమకు టికెట్లు ఎందుకు ఇవ్వరని తేజస్వీసూర్య ముందే నిలదీసినట్టు విశ్వసనీయ సమాచారం. పార్టీ కోసం ఇన్నేండ్లుగా తాము పడుతున్న కష్టం వృథా అయినట్టేనా? అని ప్రశ్నించినట్టు తెలిసింది.

సంక్షిప్తం

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయకు తీర్మానపత్రం అందజేస్తున్న గోరంట్యాల గ్రామ యాదవ సంఘం సభ్యులు

మంత్రి కేటీఆర్‌కు యాదవుల మద్దతు

గంభీరావుపేట, అక్టోబర్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంట్యాల గ్రామ యాదవ సంఘం సభ్యులు మంత్రి కేటీఆర్‌కు మద్దతు తెలిపారు. గురువారం వారు గోరంట్యాలలో సమావేశమై, అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి కేటీఆర్‌కు మద్దతునిస్తున్నట్టు ప్రకటించారు. కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి కేటీఆర్‌ను సిరిసిల్ల నుంచి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం వారు జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయకు తీర్మానపత్రం అందజేశారు.

మంత్రి తలసానికి పలు సంఘాల బాసట

అమీర్‌పేట్, అక్టోబర్ 12: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కే ఓటు వేస్తామంటూ సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ సంఘాల ప్రతినిధులు తీర్మానాలు చేస్తున్నారు. బుధవారం రాత్రి అమీర్‌పేట్ సిఖ్ ప్రతినిధులు, ఎస్సార్ నగర్ వయోధికుల మండలి ప్రతినిధులు వేర్వేరుగా సమావేశమై తలసానికి మద్దతు ప్రకటించారు. సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతుగా తమ ఓట్లు వేస్తామంటూ ఏకపక్ష తీర్మానాలు చేశారు. సిఖ్ కమిటీ ప్రతినిధులు గురువారం ఉదయం మంత్రి తలసానిని కలిసి తీర్మాన పత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్యే ఆలకే మా ఓటు..

పాతజంగమాయపల్లి వాసుల తీర్మానం

కొత్తకోట, అక్టోబర్ 12 : 'ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే మా ఓటు' అంటూ కొత్తకోట మండలంలోని పాతజంగమాయపల్లి గ్రామస్థులు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. కనిమెట్ట-పాతజంగమాయపల్లి గ్రామాల మధ్య ఊకచెట్టు వాగుపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎంలు చంద్రబాబు, వైఎస్సార్‌కు ఎన్నో సార్లు విన్నవించుకున్నామన్నారు. ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు మారినా తమ సమస్య మాత్రం తీరలేదని ఆవేదన చెందారు. ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక తమ కష్టాలను చూసి చలించి బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. ఇందుకోసం రూ.12.35 కోట్లు కేటాయించగా.. 80 శాతం పనులు పూర్తయినట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 14 గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయని వారు పేర్కొన్నారు. గ్రామానికి ఇంత మంచి చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతు ఇస్తామంటూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు చెప్పారు.

ఎర్రబెల్లి నామినేషన్‌కు విరాళాలు

దేవరుప్పుల, అక్టోబర్ 12: పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు నామినేషన్ ఖర్చులు అందజేసేందుకు మహిళలు ముందుకు వచ్చారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా కుట్టుశిక్షణ పొందిన మహిళలు ఈ మేరకు విరాళాలు సేకరించారు. గురువారం వారు తమకు తోచిన డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు నెల రోజులపాటు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుట్టుశిక్షణ ఇచ్చి, ఉచితంగా మిషన్ అందజేశారని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో రోజూ భోజన సదుపాయం కల్పించారని వారు గుర్తుచేశారు. ఇందుకు కృతజ్ఞతతో తాము సేకరించిన డబ్బులతో ఎర్రబెల్లి నామినేషన్ వేయాలని వారు కోరారు.

ఈటలా భయపడ్డారా?

నాడు సీఎం కేసీఆర్ గురించి అన్న మాటలు గుర్తున్నాయా?

రెండుచోట్ల పోటీ చేస్తానన్న ప్రకటనపై బీఆర్ఎస్ నేతల ఎద్దేవా

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఓటమి భయంతోనే రెండుచోట్ల పోటీ చేస్తానని ప్రకటించారా? అని బీఆర్ఎస్ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. గత నెల 21న 115 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించిన సీఎం కేసీఆర్.. తాను గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నట్టు వెల్లడించారు. దీనిపై ఈటల రాజేందర్ స్పందిస్తూ.. 'ప్రజాదరణ ఉన్నవారు, అప్రతిహతంగా గెలిచేవారు అయితే సీఎం కేసీఆర్ రెండు సీట్లలో ఎందుకు పోటీ చేస్తున్నారో చెప్పాలి. ఇది చాలదా కేసీఆర్ భయం తెలవడానికి' అని వ్యాఖ్యానించారు. నాడు ఈటల రాజేందర్ అన్న ఈ మాటలను గుర్తుచేస్తూ.. హుజూరాబాద్‌లో ఓడిపోతానన్న భయంతోనే రెండు సీట్లలో పోటీ చేస్తున్నారా? అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. హుజూరాబాద్ ప్రజలను నమ్మించి మోసం చేయడానికే ఈటల రెండు సీట్లలో పోటీ చేస్తున్నారని మండిపడుతున్నారు. ఎవరికి వారే టికెట్లు ప్రకటించుకునే సంప్రదాయం బీజేపీలో లేదని, అభ్యర్థులు ఎవరో సెంట్రల్ కమిటీ నిర్ణయిస్తుందంటూ ఆ పార్టీ ప్రస్తుత, మాజీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు చెప్పిన విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అలాంటిది ఈటల రెండుచోట్ల పోటీ చేస్తానని స్వయంగా ప్రకటించుకోవడం ఏమిటి? ట